పురుషోత్తం, వెంపటి

నానారాజ్యసంఘము

బెజవాడ, 1924

Record no. 396

Puruṣōttaṃ, Vempaṭi

Nānārājyasaṅghamu

Bejavāḍa, 1924

Record no. 396

Bibliographic Record Target

పురుషోత్తం, వెంపటి.

నానారాజ్యసంఘము / వెంపటి పురుషోత్తం.- బెజవాడ : వాణీ ముద్రాక్షరశాల, 1924.

24 p. ;18 cm.

Record no. 396

Puruṣōttaṃ, Vempaṭi.

Nānārājyasaṅghamu / Vempaṭi Puruṣōttaṃ.- Bejavāḍa : Vāṇī Mudrākṣaraśāla, 1924.

24 p. ;18 cm.

Record no. 396

నానా రాజ్య సంఘము

THE

League of Nations

Vempati Purushottam, B.A., L.T.

(Written in accordance with the Proceedings Dis. 5025/23 dated 21-12-23 of the Director of Public Instruction.)

Printed at the Vani Press, Bezwada.

1924.

Cost 0—3—0.

శ్రీరస్తు.

లోకేశాంతిర్వర్ధతాం.

నానారాజ్యసంఘము

వెంపటి పురుషోత్తం, బి. ఏ., ఎల్. టి.,
కృష్ణాజిల్లా, గన్నవరం, బోర్డుహైస్కూలు సహాయోపాధ్యాయుడు

డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ ఇన్‌స్ట్రక్షన్‌వారి
Dis No. 5025/23 of 21-12-23 సర్క్యులరు ననుసరించి
వ్రాయబడినది.

1924

బెజవాడ
వాణీ ముద్రాక్షరశాలయందు
ముద్రింపబడినది.


[వెల 0—3—0.

సర్వస్వామ్యసంకలితము]



Aeroplane.
ఆకాశవిమానము.

విషయసూచిక



Zeppelin.
వాయువిమానము.

శ్రీరస్తు.

పీఠిక

యుద్ధము లన్ని దేశములలోను, అన్ని జాతులలోను, ప్రాచీనకాలమునుండియు నేటివరకును జరిగినవి. పరిశీలించి చూచితిమేని ప్రతియుద్ధమునకును రాజ్యకాంక్షయో, వర్తకపు చిక్కులో, కారణములుగ నగపడును. ప్రతియుద్ధమును ప్రపంచమునకు తీరరాని సంక్షోభము గలిగించును.

ఇట్టి భయంకరములగు యుద్ధముల నాపి ప్రపంచమున శాంతి కలుగు కొరకు 1815 వ సంవత్సరములో, యూరపు ఖండమున "హోలీ అలయన్సు" (Holy Alliance) అని ఒక సంఘ మేర్పడినది. కాని ఆ సంఘముయొక్క కోరికలు కొనసాగినవి కావు. తిరిగి 1898, 1907 సంవత్సరములలో హాలెండు దేశమందున్న "హేగ్" (The Hague) పట్టణమున స్వల్పకారణములకు యుద్ధము రాకుండగను, లోకమున శాంతి, ధర్మము, నెలకొల్పుటకును ప్రయత్నములు జరిగినవి. కాని అవన్నియుకూడ విఫలమయ్యెను,

ఏలయన 1914 సం॥లో జర్మనీదేశపు కైజరు చక్రవర్తి తక్కిన దేశములవారితో తనకు గల సంధిషరతులను నిరాదరణచేసి తిరిగి యుద్ధమును ప్రారంభించెను. ఈ సంగ్రామము వలన పెక్కు నష్టములు గల్గెను. ఆ నష్టము లన్నియు నీ పొత్తమున విపులముగ వ్రాయబడినవి. ఇట్టి భయంకరమైన సంగ్రామ మిదివర కెన్నడును జరిగియుండలేదు. దానివలన జనులందరకు ఇక ముం దెన్నడును యుద్ధము కూడదను విశ్వాసము ఏర్పడెను. యుద్ధము ముగిసినవెంటనే 1919 వ సంవత్సరములో పెక్కు రాజ్యములవారు కలసి

"నానారాజ్యసంఘము"ను స్థాపించిరి.

స్థాపించిన దాదిగ ఈ సంఘమువా రింతవరకు ఆరు సభలను జరిపిరి ఇక ముం దెన్నడు యుద్ధములు కలుగకుండగను, లోకమున శాంతి ప్రబలి జనులకు సర్వసౌఖ్యములు కలిగించుటకును, ఈ సభలలో ప్రయత్నములు సలుపుచున్నారు. రాజ్య పద్ధతులు, పాటక జనుల కష్టములు, నావిక సైనికదళములు తగ్గించుట, ఆరోగ్యసంఘముల నెలకొల్పుట మొదలగు ముఖ్యవిషయము లెన్నియో ఈ సభలలో చర్చింప

బడుచున్నవి. ఈ సంఘముయొక్క ఐదవ మహాసభ గడచిన జూలైమాసములో లండను పట్టణమందు జరిగినది. ఆరవ సభ గత సెప్టెంబరుమాసమున జనీవాలో జరిగినది. ఆంగ్లేయ ప్రధానమంత్రి యగు రామ్సే మాక్డానల్డుగా రీ సభయందు అతీతమైన నేర్పును హెచ్చరికను జూపిరి.

ఈ సభలలో హిందూదేశమునకుగూడ ప్రాతినిధ్యము కలదు. ఇట్టి సభలు ప్రతి సంవత్సరమును జరుగుచుండును. అందువలన మన దేశమునకును, ప్రపంచమునకును, శాంతి చేకూరి ఇంక ననేకోపయోగములు గలుగ నున్నవి. ఈ కారణములచేత గొప్పపనులనుచేయునట్టి ఈ మహాసంఘమును గూర్చి తెలియుట, బాలుర కత్యావశ్యకమైన విషయము.

అందుచే, నిటీవల గవర్నమెంటువా రాజ్ఞాపించుట చేత, డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ ఇన్‌స్ట్రక్షన్‌వారి వద్దనుండి జిల్లా విద్యాశాఖాధికారులకు వచ్చిన సర్క్యులరు ననుసరించి బాలుర కుపయుక్తముగ నుండునటుల, సులభశైలిని కొలది పేజీలకు మించకుండ "నానారాజ్యసంఘము"ను గూర్చి ఈ పుస్తకమున కొన్ని విషయములు ముచ్చటింప బడినవి. గాన, ఉపాధ్యాయు లందరు ఇట్టి మహాసంఘమునుగూర్చియు, దాని సదుద్దేశ్యములను గూర్చియు, బాలురకు బోధచేసి వారిని రాజభక్తిపరులుగ జేయుదురుగాత.

నా కీ గ్రంథ రచనాబుద్ధి కలిగించి హెచ్చరించి నట్టి, కృష్ణాజిల్లా విద్యాశాఖాధికారికి పర్సనల్ అసిస్టెంటగు, మ. రా. శ్రీ. హరి వేరయ్య శాస్త్రిగారికి నా వినయపూర్వక వందనములు.

వెంపటి పురుషోత్తం.



పంచమ జార్జి చక్రవర్తి



ఇంగ్లాండునకు ప్రధానమంత్రిగానుండిన
లాయిడ్ జార్జి ప్రభువు.

శ్రీరస్తు

నానారాజ్యసంఘము

లోకేశాంతిర్వర్ధతాం

ఐరోపా మహాసంగ్రామము, దానివలన కలిగిన నష్టములు:-

బాలులారా! మీరు యుద్ధమనగా నేమియో ఇది వరకు వినియుందురు. చరిత్రలలోను, పురాణ కథలలోను యుద్ధములను గూర్చి వినెదరు. కాని యీ ప్రపంచములో జరిగిన యుద్ధములలోనెల్ల మిక్కిలి ఘోరమైన సంగ్రామము ఐదు సంవత్సరముల క్రిందనే ముగిసినది.

ఈ గొప్పయుద్ధమును గూర్చి మీరు చదువకపోయి నను వినియుండవచ్చును. ఈ గొప్పయుద్ధము వలన గలిగిన క్రూరనష్టములను, ఎన్నిటినో నేటికిని అనుభవించుచున్నాము. బజారులో ప్రతి వస్తువుయొక్క విలువయు యుద్ధమునకు ముందుకంటె ననేక రెట్లెక్కువైనది.

ఈ ఘోరయుద్ధమునకు ముఖ్యకారణము మీకు దెలిసి యునా? చెప్పెద వినుడు. యూరపుఖండమందు జర్మనీయను దేశమొకటి కలదు. ఆ దేశమువారు శక్త్యుపాసకులు. అనగా

వారికి బలమే ప్రధానవిషయము. తమ బలముచేత ప్రపంచమంతను వశపరచుకొనెదమని గర్వించి యుద్ధమునకు దిగిరి. స్వలాభమునకయి అన్యదేశములను జయించవలెనని వీరి దురాశ.

కాని మన పరిపాలకులైన బ్రిటిషువారును, ఫ్రెంచివారును, ఇంక మఱికొన్ని రాష్ట్రములవారును కలసి అట్టి యన్యాయవర్తనము కూడదని తలంచి జర్మనీదేశము నెదుర్కొనిరి. 1914 వ సంవత్సరమున ప్రారంభమై, 4 సంవత్సరముల మూడుమాసము లెడతెగక యీయుద్ధము జరిగెను. 1919 వ సంవత్సరములో యుద్ధము ముగిసినది.

ఈ ఐదు సంవత్సరములలో జరిగిన మహాయుద్ధము వంటి యుద్ధము, ఇదివరకెన్నడును జరిగినట్లు గనుపించదు. ద్రవ్యమునందు, జనమునందు, బలమునందు, ఎక్కువ నాశనము కలిగెను. యోధులనేకులు చనిపోయిరి. పెక్కుకుటుంబములు నాశములయినవి. అనేక పట్టణములు కేవలము దిబ్బలయినవి. 'భూమిమీదనుండి, సముద్రముమీదనుండి, ఆకాశము మీదనుండి శత్రువులు భయంకరములగు నస్త్రములను ప్రయోగించిరి. యుద్ధభూమిని రక్తము ప్రవాహములుగ బారెను.'

కాని ధర్మముతో గూడని బల మెక్కువ కాలము నిలువజాలదు. గనుకనే, 1919 వ సంవత్సరమున జర్మనీదేశపు కైజరుచక్రవర్తి యోడిపోయి, తుదకు సంధికి ఒప్పుకొనెను. అప్పుడు ఫ్రాన్సుదేశమునకు ముఖ్యపట్టణమైన ప్యారిసు పట్టణమున సంధిసభ జరిగెను.

యుద్ధసమయమునందు ప్రపంచమంతయు దల్లడిల్లిపోయెను. యుద్ధమువలన గలిగిన నష్టములనుజూచి, అన్నిదేశములవారును లోకశాంతికై తపించిరి. అంతర్జాతీయసమస్యలు యుద్ధమువలన దీర్చుట శక్యముగాదని యెల్లరును దెలిసికొనిరి. శాంతిమార్గముల వలననే యన్నిసమస్యలు సాధించుట మంచిదని యన్నిజాతులవారును అంగీకరించిరి.

నానారాజ్యసంఘమన నేమి?

ఈ కారణములచేత సంధిసభకు వచ్చిన 33 రాజ్యములవారును వారిచే పిలువబడిన మఱియొక 13 రాజ్యములవారును కలసి " **నానారాజ్య సంఘము** " నొక దానిని స్థాపించిరి. దీనికే ఇంగ్లీషులో "దిలీగు ఆఫ్ నేషన్సు" (The League of Nations) అని పేరు. పూర్వముగూడ ఇట్టి ప్రయత్నములు యూరపుఖండమున మూడు నాలుగు సా

రులు ఇట్టి పరిస్థితులయందే జరిగినవి. కాని అవన్నియు కొన సాగినవికావు.

ప్రస్తుతము ఈ "నానా రాజ్య సంఘము" నందు చేరిన రాష్ట్రములలో అమెరికా, ఫ్రాన్సు, బ్రిటిషు సామ్రాజ్యము ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, న్యూజిలాండు, హిందూదేశము ముఖ్యమయినవి.

యూరపుఖండములో "జనీవా" యను పట్టణమున ఈ సంఘముయొక్క సభలు జరుపబడును. ఈ "నానా రాజ్య సంఘము" స్థాపించిన దేశములవారుగాక, సంపూర్ణస్వతంత్ర రాజ్యములవారు, డొమినియను అధికారము గల దేశముల వారు, వలసరాజ్యములవారు మాత్రమే, ఈ సంఘమునకు సభ్యులుగా జేరవచ్చును. ఎవరైన, ఈ సంఘసభ్యతె గావలె నని కోరినచో సంఘప్రతినిధులు మూడింట రెండు వంతుల మంది యొప్పవలెను. సభ్యులెవరైన నీసంఘము వదలి వెళ్ల వలసినచో, రెండు సంవత్సరములకు ముందుగా నోటీసు నీయవలెను.

ఈ పెద్ద సంఘమున కొక కౌన్సిలుకలదు ఈ కౌన్సిలు జనీవాలోగాని, సభ్యులుకోరిన మరియొక చోటగాని సంవత్సరమున కొకసారి సమావేశ మగును. ఏదేశమునకెం



కీర్తిశేషులయిన అమెరికా దేశాధ్యక్షు లగు

విల్సను ప్రభువుగారు.



బికానీరు ప్రభువు.

నావికాబలముండవలెనో, సైన్యమెంత యుండవలెనో, నిర్ణయించుటకు మఱియొక చిన్న సంఘము గూడ కలదు.

ఈ సంఘముల సభలు నడుపుట కొక కార్యదర్శి గలడు. ఈ సంఘములలో నేపదవికైనను మగవారేగాక, ఆడువాండ్రు కూడ చేరవచ్చును.

—. నానారాజ్యసంఘముయొక్క యుద్దేశ్యములు. —

లోకమంతయు శాంతముగ నుండుటకు నీ సంఘము మార్గముల వెదకును. యుద్ధములుకలుగకుండ అనేకవిధముల పాటుబడును. ఒక్కొక రాజ్యముయొక్క భద్రతకు, శాంతికి, నెంత సైన్యముండవలయునో యేర్పాటుచేయును. ఏదేశము లకెట్టి యాయుధములుండవలెనో, ఎన్ని యాయుధములుండవలెనో, నిశ్చయించును. ఏదేశమువారైన సంఘము వారేర్పరచిన సైన్యసంఖ్యను మించి, రహస్యముగ సైన్యమును వృద్ధి చేసినచో, వారు సంఘమువారిచే శిక్షింపబడుదురు.

సభ్యదేశీయు లొకరితోనొకరు యుద్ధము చేయమని ప్రమాణము చేసికొనిరి. అటులగాక నేదైన యుద్ధమునకు గారణముండినకైన, సభ్యదేశీయులొకరు, చిన్నసంఘమునొక దానినేర్పరచి, మధ్యవర్తిగానుంచి, తగాదాను పరిష్కారము

చేయుదురు. ఈచిన్న సంఘమునకు "అంతర్జాతీయోన్నత న్యాయస్థానము" (Court of International Justice) అని పేరు.

ఈ మధ్యవర్తి పరిష్కారము చేసినటుల ఏదేశము వారొప్పుకొనకపోయినను, సభ్యత్వముగల యన్ని దేశముల వారును, ఆదేశమును 'బహిష్కరించెదరు'. 'బహిష్కార' మనగా, ఒకదేశమునకు ఇతర దేశములవారు సరకులు పంపకుండుట, ఆదేశమునుండి సరకులు కొనకుండుట. ఇట్లు చేసినచో బహిష్కరింపబడిన దేశము కొద్దికాలములోనే శత్రువులకు లొంగిపోవును.

ఈ "నానారాజ్యసంఘము" నకింకను బాధ్యతలు గలవు. ప్రపంచమందు విశేష నాగరికత లేని దేశములు కొన్ని గలవు. అట్టి దేశములకు స్వయముగా పరిపాలన చేసికొను విధములు తెలియవు. అట్టి దేశముల నీ సంఘమువారేదోయొక పెద్ద రాజ్యముయొక్క యధికారమున నుంచెదరు.

ఈ పెద్ద రాజ్యమువారు, వారి యధికారమునందుంచబడిన చిన్న రాజ్యమువారికి, రాజ్యపద్ధతులను నేర్పుచు, ఆదేశమువారిని వృద్ధిలోనికి తేవలెను. అట్లుచేయుచు, ఆరా

జ్యముయొక్క యభివృద్ధిని గూర్చి సంవత్సరమునకొక పర్యాయము, "నానారాజ్యసంఘము" వారి కొక ప్రకటనను (రిపోర్టును) పంపెదరు. ఆపెద్దరాజ్యము వారెట్టి యన్యాయములను చేయకుండ, "నానారాజ్యసంఘము" వారు జాగ్రత పడెదరు.

"నానారాజ్యసంఘ" మింకను, అనేకములైన గొప్ప పనులను చేయును. అన్నిదేశములందును కూలి చేసికొను స్త్రీలకు, బిడ్డలకు, పురుషులకు, కూలి మొదలైన విషయములందు సౌకర్యములు కలుగజేయును. ఈ కూలివాండ్ర కష్టసుఖముల నాలోచించుటకు మఱియొక చిన్న "పాటకపు సంఘము" (Labour Commission) కలదు.

వర్తక వ్యాపారముల సరిగా జూచుచు ప్రతి మనుష్యునకును వానికి దగినటుల సుఖజీవనము కలిగించుటకు, ఈ "నానారాజ్యసంఘము" ప్రయత్నించును. ఇంక, ప్రపంచములో కాటకములు రాకుండ కట్టుదిట్టములు చేయును. జనులందరు నన్నివిధముల సౌఖ్యముగా నుండవలెనని, ఈ సంఘముయొక్క ముఖ్యోద్దేశ్యము.

సమస్త దేశములవారును మంచి స్నేహ స్వభావము గలిగి, యన్నదమ్ములవలె నుండవలెనని, యీ సంఘమువారి

కోరిక. ఏదేశములకైన సంధిషరతులు నిశ్చయించి నప్పుడా షరతులు. సంఘ కార్యదర్శివద్ద రికార్డు చేయబడును. ఆ షరతుల నేదేశమువారైన నతిక్రమించినచో, తక్కిన దేశముల వారాదేశమునకు విరోధులై, వారిని శిక్షించుదురు.

కొన్ని దేశములందు స్త్రీలను, పిల్లలను, బలవంతముగ బట్టుకొని యితర దేశములవారికి బానిసలుగానమ్ము, చెడు అలవాటొకటి కలదు. అట్టి దురభ్యాసము నాపుట కీసంఘము వారు కృషిచేయుదురు. తరువాత, నల్లమందు మొదలగు విషపు సామగ్రులను విక్రయించు వర్తకులమీద, ఈసంఘము వా రధికారము నుంచుకొనిరి.

ఒక దేశమునుండి మఱియొక దేశమునకు ప్రయాణము చేయుట కీసంఘమువారు, సౌకర్యములగు బాటల నేర్పఱచుదురు. సంఘమందు సభ్యతగల దేశములవారికి, నన్ని దేశములందును, వర్తక వ్యవహారములయెడ సమాన సదుపాయములు గలుగునటుల నేర్పాటుగలదు.

ఇవన్నియుగాక, ఆస్ట్రియా మొదలగు దేశములందనేక, అంటువ్యాధులు ప్రబలముగా కలవు. ఈ వ్యాధులు ప్రపంచమంతయు వ్యాపించును. కనుక వాటిని రూపు మాపుటకు "నానారాజ్యసంఘము" వా రొక "యారోగ్యసంఘము"

నేర్పఱచిరి. ఈ ఆరోగ్యసంఘముచే నప్పుడప్పు డారోగ్యవిషయములు చర్చించుటకు సభలు జరుపబడును. అంటువ్యాధులు ప్రబలముగాకుండ తగిన యేర్పాటులు చేయబడును.

బాలులారా! చూచితిరా, ఈ "నానారాజ్యసంఘము" స్థాపించుటవల్ల ప్రపంచమునకు గలుగు ఉపయోగములు ? కాని మీ కొక సందేహము కలుగవచ్చును. ఈ మహాసంఘమం దనేక రాజ్యములవారు సభ్యులుగ నున్నారుగదా! ఏసమస్యగాని వీరిలో వీరికి తీర్మానము కానియెడల, సంఘము చీలిపోయి, తిరిగి యుద్ధములుకలుగవా? యని యడుగవచ్చును.

కాని యట్టి భయమేమియును లేదు. ఏలయన ప్రపంచమంతయు దల్లడిల్లిపోయి యుద్ధము పేరు చెప్పిన, అందరకు నొకవిధమైన భయమును, అసహ్యమును పుట్టెనవి. యుద్ధమునందు బోరాడిన దేశముల వారందఱకును మిక్కిలి నష్టములు కలిగెను. అట్టి దేశస్థుల హృదయములనుండి ఈ సంఘము స్థాపింపవలెనని కోరికపుట్టెను. గనుక సంఘము చీలిపోవు నను భయము లేదు. మఱియొక కారణ మేమన, ఈసంఘ సభ్యులెల్లప్పుడు ననేక విషయములలో శ్రద్ధతో పనిచేయుట కనేక ఉపసంఘముల నేర్పరచియున్నారు. కనుక నీ సంఘ మెన్నటికిని చీలిపోజాలదు.

బాలులారా! ఇట్టి సంఘ మేర్పడక పోయినచో, ప్రపంచము యొక్క గతి యేమి యయ్యెడిది? నావికాదళములు, సైనికాదళములు, మితిలేక పెరిగెడివి. మారణాస్త్రములు ప్రపంచమును భస్మీపటలము చేసెడివి. కృత్రిమము, కుట్రలు బయలుదేరి ప్రపంచమున శాంతియుండెడిదికాదు. ఇంతయేల ప్రపంచ మొక మహాప్రళయమున మునిగిపోయెడిది.

కాని యీ సంఘము స్థాపించుట వలన జాతుల నన్నిటిని కలుపునట్టి సంబంధము లెక్కువైనవి. ఎట్టి జాతుల వారికిని యుద్ధమన, నొక యబద్ధపుమాటగా దోచుచున్నది. ఈ “నానారాజ్యసంఘము” వృద్ధి పొందుటవలన ముందు ముందు శాంతి మార్గములవలననే లోకమున కంతకు శాంతి చేకూరును.

లోకమంతకును శాంతి చేకూరుట గొప్ప విషయము. కాని ముఖ్యముగా మన దేశమున కీసంఘము వలన లాభము లేమి? బ్రిటిషుసామ్రాజ్యముతరఫున బ్రిటిషు మంత్రులు మాత్రమే సభల కేగుటయేగాక, వలసరాజ్యములనుండి ప్రతినిధులను పంపుటకు హక్కుగలదని మీ రిదివరకు చదివియున్నారు. పరిపాలకుల యుదారస్వభావముచేత నీయబడిన యిట్టి హక్కువలన, పూర్వమువలె స్వల్పాంశముల కొరకే

యుద్ధమునకు దిగి, ప్రజానాశము చేయు పద్ధతులు వదలి, ప్రజలందఱు శాంతిమార్గముల నవలంబించుచున్నారు.

“నానారాజ్యసంఘము” యొక్క మొదటి సభ “జనీవాలో” జరిగినప్పు డీ హక్కువలననే, హిందూదేశము నుండి మన ప్రతినిధులుగా సింహా ప్రభువును, బికానీరు ప్రభువును వెళ్ళి, మన దేశీయులయొక్క కష్ట సుఖములను గూర్చి ముచ్చటించిరి. ఇటులనే ప్రతిసంవత్సరమును సభలు జరుగును. ఇట్టి సభలయందు హిందూదేశము గూడ పాల్గొనుటచేత, ముందు ముందు మన దేశమునకు మంచి లాభములు గలుగ నున్నవి.

కనుక నిట్టి గొప్ప సంఘమును స్థాపించుటకు మూల పురుషుడైనట్టియు, కొలదికాలము క్రిందటనే కాలముచేసినట్టియు, అమెరికా దేశాధ్యక్షుడగు విల్సను ప్రభువునకును, మన పరిపాలకుల ప్రధానమంత్రిగానుండిన లాయిడ్ జార్జి ప్రభువునకును, ఇంక తక్కిన సభ్యదేశములవారికిని, లోక మంతయు కృతజ్ఞత జూపవలయును. పరిపాలకులయెడ మన మందఱము కడు రాజభక్తిగలిగి యుండవలెను.

గీ. “ఘోరసంగ్రామ మొనరింప గూడదనుచు,
సకలరాజ్యంబులందు బ్రశాంతి వెలయ,

ప్రజల సౌఖ్యంబె చింతించి ప్రభువులెల్ల,
జగతినిపుడు, "నానారాజ్యసంఘము" నెల
కొల్పి, సాగించుచున్నారు కోర్కెమీర,
దేవుని దయచే నదియు వర్ధిల్లుగాత.
స్నేహమార్గాన దేశముల్ చెలగుచుండు,
వర్తకంబు నిర్భీతిగా వరలుచుండు,
వసుధ నారోగ్య సంఘముల్ ప్రబలుచుండు,
పాటకజనుల కష్టముల్ వాసిపోవు,
ధరణి దైవమిచ్చిన యట్టి వరముసుండి.
ఇండియా దేశపు జనులకెల్ల, నాంగ్ల
దొరతనమువారు, చేయు మేల్మరచిపోక,
శ్రద్ధగా దీని సంతయు, జదివి మీరు,
పరమ రాజభక్తులగుడు బాలురార! "

సంపూర్ణము

END OF
TITLE